## క్లుప్తంగా

### యథాస్థానాలకు ముగ్గురు వీఆర్వోలు

కర్నూలు (సెంట్రల్) : ఇటీవల జరిగిన వీఆర్వోల బదిలీల్లో ముగ్గురిని సొంత గ్రామాలకు కేటాయించారు. అయితే, సొంత గ్రామాలకు ఎలా బదిలీ చేస్తారని విమర్శలు రావడంతో రెవెన్యూ అధికారులు నాలుక కర్చుకున్నారు. తిరిగి వారిని వేరే స్థానాలకు బదిలీ చేశారు. కృష్ణగిరి మండలానికి చెందిన మీసాల మద్దిలేటి అనే వీఆర్వోను కృష్ణగిరి నుంచి బదిలీ చేయగా అతని సొంత స్థలం కల్లూరు కావడంతో తిరిగి కృష్ణగిరికి పంపారు. రామకృష్ణ అనే వీఆర్వో గూడూరు మండలం ముడుమలగుర్తి నుంచి కోడుమూరుకు బదిలీ చేశారు. అయితే అతనిని తిరిగి యథా స్థానానికి పంపారు. మరో వీఆర్వో సూరిబాబును కోడుమూరుకు బదిలీ చేశారు. అయితే అతని సొంత ఊరు కోడుమూరు కావడంతో కల్లూరుకు పంపారు.

### కలెక్టర్‌ను కలసిన జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా నియమితులైన బి.చెన్నకేశవరెడ్డి మంగళవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను ఆయన చాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి రిజిస్ట్రేషన్‌శాఖ పురోగతిని వివరించారు.

### రంగస్థల కళాకారుడు సుబ్బారావు మృతి



కర్నూలు కల్చరల్ : ప్రముఖ సినీ రంగస్థల కళాకారుడు జి.సి.సుబ్బారావు మంగళవారం మృతి చెందారు. వీరు 45 సంవత్సరాల నుంచి రంగస్థలంలో మంచి గాయకుడిగా గుర్తింపు పొందారు. శ్రీకృష్ణుడు, అర్జునుడు, శ్రీరాముడు, ఆంజనేయుడు, నక్షత్రకుడు, దామోదరుడు, జనకుడు తదితర పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. ఈయన మృతికి కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్ బాబు, కళాకారులు భాస్కర్ యాదవ్, వినోద్‌కుమార్, జయం రాజు, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, శంకర్‌రెడ్డి, హార్మోనిస్టు లక్ష్మన్న తదితరులు సంతాపం ప్రకటించారు.

### సత్యనారాయణకు నివాళి

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకుడు కొరటాల సత్యనారాయణ నమ్మిన సిద్ధాంతం కోసం పని చేశారని సీపీఎం నాయకులు కొనియాడారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో కొరటాల సత్యనారాయణ వర్ధంతి కార్యక్రమాన్ని కమిటీ సభ్యురాలు కె.అరుణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.నిర్మల, జిల్లా నాయకులు కేవీ నారాయణ, టి.రాముడు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను స్మరించుకున్నారు.

### ఇసుక పంపిణీకి ఏర్పాట్లు

కర్నూలు న్యూసిటీ : ఇసుక పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు గనులు, భూగర్భగనుల శాఖ ఉపసంచాలకులు రాజశేఖర్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఓ సాంకేతిక నిపుణులతో కలసి ఆయన సి. బెళగల్ మండల పరిధిలోని కొత్తకోట, సింగవరం ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....రీచ్‌లలో ఇసుకు నిర్వహణను పగడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చోట్ల కస్టమైజ్డ్ కెమెరాల ఏర్పాటుకు సాధ్యాలను పరిశీలించినట్లు వివరించారు.

### బాధ్యతల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ : బదిలీపై వచ్చిన విద్యుత్ ఉప కార్యనిర్వాహక ఇంజినీరు (డీఈఈ) జగదీష్ నాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు తిరుపతికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన నూతన డీఈఈని కార్యాలయం ఉద్యోగులు బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు.

### ప్రభుత్వాల విధానాలపై పోరు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు దిగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన కర్నూలు రూరల్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా, కడప స్టీలుప్లాంటును సాధించడంలో పాలక ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కర్నూలు జిల్లాలో గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్య దర్శి సురేంద్ర యాదవ్, సభ్యులుగా కృష్ణానాయక్, నాగరాజు, వెంకటేష్‌లను ఎన్నుకున్నారు.

### డీడీఓలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఫేసియల్ అటెండెన్స్ యాప్‌లో సకాలంలో సెలవు మంజూరు చేయని డీడీఓలపై చర్యలు తీసుకోవాలని అప్టా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మధుసూదన్ రెడ్డి, సేవాలాల్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫేసియల్ అటెండెన్స్ యాప్‌లో హాజరు వేయనందుకు 134 మంది టీచర్లకు డీఈఓ షోకాజ్ నోటీసులు ఇచ్చారని, ఉపాధ్యాయులు సెలవులు పెట్టినా కూడా వేళకు సెలవులు మంజూరు చేయకపోవడంతోనే ఫేసియల్ అటెండెన్స్ నమోదు కాలేదన్నారు. ఇందులో ఉపాధ్యాయుల తప్పేమి లేకపోయినా కూడా వారికి నోటీసులు ఇవ్వడం సమంజసం కాదన్నారు.

# గుండె ఆరోగ్యంపై అవగాహన అవసరం

- గుండె వ్యాధుల నివారణ చర్యలపై ప్రజలను చైతన్యం చేయాలి
- ప్రపంచ హృదయ దినోత్సవ పోస్టరు విడుదలలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, హార్ట్ ఫౌండేషన్

కర్నూలు(సెంట్రల్): ప్రస్తుతం గుండె జబ్బులు పెరుగుతుండటంతో ప్రతి ఒక్కరు గుండె ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో ప్రపంచ హృదయ దినోత్సవ అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ..గుండెవ్యాధుల నివారణ చర్యలపై ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. ఆరోగ్యకర ఆహారం, శరీరానికి అనువైన వ్యాయామం, దురలవాట్లకు దూరంగా ఉండడంతోనే గుండె ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. ప్రపంచ హృదయదినోత్సవ సందర్భంగా సెప్టెంబర్ 29వ తేదీన కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిపుణులైన డాక్టర్లు గుండె వ్యాధులు రావడానికి కారణాలు, రాకుండా ఉండేందుకు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఎక్కువ మంది ప్రజలను ఆహ్వానించాలని సూచించారు. హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ..కర్నూలులో హార్ట్ ఫౌండేషన్‌ను 2022లో ఏర్పాటు చేశామని, అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29వ తేదీన ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుండె పోటు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై వైద్యులు అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ సంవత్సరంలో ఔట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును తిరుపతికి చెందిన శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కార్డియాలజీ వైద్యుడు డాక్టర్ డి.రాజశేఖర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కల్కూర చంద్రశేఖర, డాక్టర్ భవాని ప్రసాదు, ట్రేజరర్ రాముడు, సభ్యులు శర్మ, లక్ష్మణ్, వాసుదేవమూర్తి, ప్రహ్లాద్,జగన్నాథ గుప్తా పాల్గొన్నారు.

#### పెండింగ్ ఫారాలను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్) : ప్రత్యేక సంక్షిప్త సవరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారాలను నూటికీ నూరు శాతం పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన స్పెషల్‌సమ్మరీ రివిజన్ పై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో టెలీ కాన్ఫరెన్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంటింటికి వెళ్లి ఫారాల పరిశీలనలో జిల్లా సగటు 98.31 శాతం ఉంటే ఆదోని అసెంబ్లీలో మాత్రం 94.73 శాతం పూర్తయిందని, ఇందులో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. మిగిలిన అసెంబ్లీల్లో కూడా పెండింగ్‌లో ఉన్న ఫారాలను నిర్దేశించిన గడువులోపు పరిశీలన చేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర -2047 దార్శనిక పత్ర రూపకల్పనకు ప్రజల నుంచి అభిప్రాయ సేకరణచేయాలని అధికారులను ఆదేశించారు. WWW. SWARNADHRA .AP.GOV.IN ద్వారా సజషన్స్ బాక్స్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలు చెప్పవచ్చని, ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయ్యేలా చూడాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య తోపాటు అధికారులు పాల్గొన్నారు.

#### పర్యాటక ప్రాంతాలకు రహదారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు రూ.3.33 కోట్లతో రహదారులను నిర్మించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన డిస్‌ప్లే బోర్డు నమూనాను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న మతపరమైన పర్యాటక ప్రాంతాలు, ఎకో టూరిజం స్పాట్లు, హెరిటేజ్ టూరిజం ప్రాంతాల వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు డిస్ ప్లే బోర్డు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ నమూనా బోర్డును అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గార్గేయపురం, జగన్నాథగట్టు, కేతవరం గుహలు, ఉరుకుంద, అశోక శిలా శాసనాలు, సుంకేసుల, రూపాల సంగమేశ్వర స్వామి, హరిత రాక్ గార్డెన్లలో పర్యాటక ప్రాంతాల వివరాలను తెలిపే డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాక ఆయా ప్రాంతాలను కలుపుతూ రోడ్లను కూడా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

### తూకాలు తనిఖీ చేసిన సెక్రటరీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆర్.జయలక్ష్మి మంగళవారం మార్కెట్ యార్డులు తిరిగారు. వివిధ పంట ఉత్పత్తుల తూకాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. తూకాల్లో తేడాలు వచ్చినా.. కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు దగా చేసినా వెంటనే తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. టెండరు హాలును తనిఖీ చేశారు. టెండరు హాలు సిబ్బంది డ్యూటీలు, వారి పనితీరును పరిశీలించారు.

### కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

కర్నూలు(సెంట్రల్) : కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం వేర్ హౌస్ గోదాములో ఏపీ వేర్ హౌస్ హమాలీ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కుదించడంతో కార్మికుల బతుకులు బానిసల కంటే హీనంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణుమూర్తి, ఎం.మల్లికార్జున, రంగన్న, సుధాకర్, ఇషాక్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### పలువురు డీఈఈలు, ఏఈలు బదిలీ

కర్నూలు (టౌన్) : నగరపాలక ఇంజనీరింగ్ విభాగంలో పలువురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజి, అసిస్టెంట్ ఇంజిను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సాంకేతిక శాఖ ఇంజనీర్-ఇన్- చీఫ్ గోపాల్ క్రిష్ణ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్. రాజశేఖర్‌ను ఆదోని మున్సిపాల్టీకి, కె. రవిప్రకాష్‌నాయుడు రాయదుర్గం మున్సిపాల్టీకి, గోపాలక్రిష్ణను అమరావతి ఏపీడీసీకి బదిలీ చేశారు. మున్సిపాల్టీలో పనిచేసే డీఈఈ మనోహర్ రెడ్డిని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు అలాగే నంద్యాల మున్సిపాల్టీలో పనిచేసే గంగాధర్‌ను కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు, నంద్యాల మున్సిపాల్టీలో పనిచేసే జి. శ్రీనివాసరెడ్డిని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. కర్నూలు మున్సిపాల్టీలో పనిచేసే అసిస్టెంట్ ఇంజనీర్ బి. దినేష్‌కుమార్‌ను నందికొట్కూరు మున్సిపాల్టీకి, కె. జనార్ధన్‌ను ఆదోని మున్సిపాల్టీకి, గూడురు నగర పంచాయతీలో పనిచేసే ఏఈఈ వైష్ణవిని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు నందికొట్కూర్ మున్సిపాల్టీలో పనిచేసే డీఈఈని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేశారు.

### జిల్లావాసులకు చోటు

కర్నూలు న్యూసిటీ : తెలుగుదేశం పార్టీ నామినేటెడ్ పదవులను ప్రకటించింది. పలు కార్పొరేషన్లలో జిల్లాకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులకు సభ్యుల స్థానాలు దక్కాయి. పద్మశాలి సంక్షేమ సంఘంలో పత్తికొండ నియోజక వర్గానికి చెందిన కొంకతి లక్ష్మీ నారాయణ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అలాగే ఏపీ టూరిజం కార్పొరేషన్‌లో కర్నూలు నియోజక వర్గానికి చెందిన కైప పద్మలతారెడ్డి ఎన్నికయ్యారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్) : నవంబర్ 1వ తేదీన జరిగే దీపావళి పండుగ కోసం టపాకాయల విక్రయాల కోసం ఆసక్తి ఉన్న వారు తాత్కాలికంగా లైసెన్స్‌లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అంతేకాక టపాసుల కొత్త లైసెన్స్‌లు, ఫారం-ఎల్‌ఈ-5 లైసెన్స్ కోసం కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని సంబంధిత తహసీల్దార్ల ద్వారా వచ్చే 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఏకాగ్రతతో విలువిద్యను సాధన చేయండి

కర్నూలు (టౌన్) : విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో విలువిద్యను సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎడిపై పాఠశాల ప్రిన్సిపాల్ జోసఫ్ డేవిడ్ స్పష్టం చేశారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఉచిత ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఒలింపిక్ సంఘం గుర్తించిన ఈ క్రీడల్లో రాణిస్తే విద్యార్థినీ, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

### 27 నుంచి అక్కినేని శతజయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్ : టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు మూడు రోజుల పాటు నట సామ్రాట్, పద్మశ్రీ అక్కినేని నాగేశ్వర రావు శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. 27వ తేదీ నృత్య నీరాజనంతో వేడుకలు ప్రారంభిస్తామని తెలిపారు. 28వ తేదీ అక్కినేని సినిమాల్లో రికార్డు సృష్టించిన ప్రేమనగర్ సినిమాను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. 29వ తేదీ వేడుకల ముగింపు సందర్భంగా సంగీతం, నృత్యం, నాటక విభాగాల్లో కృషి చేసిన కళాకారులను సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు.

### స్థలం కేటాయించండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఫంక్షన్ హాలు కోసం బీక్యాంపులోని రెండు భవనాలను కేటాయించాలని ఆసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, ప్రేమ్‌సాగర్ కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. మంగళవారం వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. స్థలాన్ని కేటాయిస్తే అందులో ఫంక్షన్ హాలును సొసైటీ తరఫున నిర్మించి నిర్వహణ చేసుకుంటామన్నారు. ఈ హాలు రెవెన్యూ, ఇతర ఉద్యోగులు అన్ని రకాల ఫంక్షన్లు, మీటింగులు నిర్వహించుకోవడానికి అనువుగా ఉండేలా నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కిష్టోఫర్, కృష్ణమూర్తి, రామన్న పాల్గొన్నారు.

### కల్వర్టు ఎత్తును పెంచాలి

కర్నూలు(సెంట్రల్): జాతీయ రహదారి కల్వర్టు ఎత్తు తక్కువగా ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసిన కల్లూరులోని ఆదిత్యనగర్‌లోకి వర్షపు నీరు చేరుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సీపీఎం నాయకులు సాయిబాబా, వి.భాస్కరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కల్వర్టు ఎత్తు పెంచితే నీరు కాలనీలోకి రాకుండా ఉంటుందని, పలుమార్లు మునిసిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వెల్లడించారు.

### ఆశాల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(హాస్పిటల్): ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా కార్యకర్తలకు ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్. భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యల వినతి పత్రాలను స్వీకరించి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ నాగప్రసాద్‌బాబు, ఏవో అరుణ, డీపీహెచ్‌ఎన్‌వో ఇందిర, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## మందులతో మరణం ఆమోద యోగ్యం కాదు



ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): రోగి వాడే మందుల వల్ల మరణం ఆమోద యోగ్యం కాదని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజిలోని ఫార్మకాలజి విభాగం అధిపతి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి ఫార్మకో విజిలెన్స్ వీక్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ రోగం వల్ల మరణం కొన్నిసార్లు అనివార్యం కావచ్చని, అయితే మందుల దుష్ప్రభావాలు కలగరాదని, వాటిని నివారించేందుకు ఏర్పడిందే ×ఫార్మకో విజిలెన్స్‌॰ అని చెప్పారు. గత వారం రోజులుగా అవగాహన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ విజయానందబాబు, ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## టొబాకో సలహా సెంటర్ ప్రారంభం



టొబాకో సజేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక వైద్య విభాగంలో మంగళవారం టొబాకో సజేషన్ (సలహా) సెంటర్‌ను కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినర్సమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు పొగాకు రహిత యువత ప్రచారం 2.0 సందర్భంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి వర్చువల్ ద్వారా ఈ కేంద్రాన్ని దేశమంతటా ప్రారంభించారన్నారు. అందులో భాగంగా తాను ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ కె. నాగేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్‌నాయక్, టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్ సైకాలజిస్టు చంద్రశేఖర్, సీనియర్ రెసిడెంట్స్ డాక్టర్ మౌనిక, డాక్టర్ రోషిణి తదితరులు పాల్గొన్నారు.

## 1న విశాఖ ఉక్కు కోసం నిరసన దీక్షలు



అభివాదం చేస్తున్న యువజన, విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): అక్టోబర్ ఒకటో తేదీన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్,ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు షాబీర్ బాషా, అబ్దుల్లా, నగేష్, మహేంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో వారు సమావేశమై నిరసనదీక్షల విజయవంతంపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, ఆత్మగౌరవం అని తెలిసీ కూడా కూటమి నాయకులు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు నిరసన దీక్షలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆది తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యత కలిగి ఉండాలి



రక్తదానం చేసిన ఆర్‌యూసీఈ ప్రిన్సిపాల్ హరిప్రసాద్ రెడ్డికి సర్టిఫికెట్ ఇస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్



సేకరించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులతో వర్సిటీ రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ

కర్నూలు కల్చరల్: యువతీ యువకులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆర్‌యూలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు బ్లడ్ బ్యాంక్, తల సేమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ తల సేమియాతో బాధపడుతున్న పిల్లలకు అవసరమయ్యే రక్తాన్ని దానం చేయడానికి తమ వర్సిటీ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పి.వి. సుందరానంద్, రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరిప్రసాద్‌రెడ్డి, వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాల సమయంలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. మొత్తం 42 మంది రక్తదానం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తల సేమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు, సభ్యులు రమేష్, వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ బి. విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

#### సామాజిక స్పృహను పెంపొందించుకోవాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ అన్నారు. మంగళవారం యూయూలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ప్రాంగణం, పరిసర ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సేకరించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ యువతీ యువకులు సేవాభావం కలిగి ఉండాలన్నారు. దేశభక్తి, సామాజిక స్పృహను పెంపొందించేందుకు జాతీయ సేవా పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి వలంటీర్ విధిగా సామాజిక సేవ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మహబూబ్‌బాషా, ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వెంకటప్ప, డాక్టర్ పాల్‌కృపాకర్, తదితరులు పాల్గొన్నారు.

## బోధన మెలకువలు మెరుగుపర్చుకోవాలి



శిక్షణకు హాజరైన వైద్యులతో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లు

కర్నూలు (హాస్పిటల్) : వైద్యులు బోధన మెలకువలను మరింత మెరుగుపర్చుకోవాలని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. మంగళవారం కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో ఎన్‌ఎంసీ గైడ్‌లైన్స్ ప్రకారం వైద్యులకు బేసిక్ లైఫ్ సైన్స్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బోధకులు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకుంటే ఉత్తమ వైద్య ఉపాధ్యాయులుగా గుర్తించబడతారన్నారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, ఎంఈయు కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సింథియా శుభప్రద, సభ్యులు డాక్టర్ విజయానంద బాబు, డాక్టర్ విశాల, డాక్టర్ అరుణ, డాక్టర్ కుముద, డాక్టర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు (హాస్పిటల్) : ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు డీవైఎఫ్ఐ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందిస్తామని చాలా ఆసుపత్రులు రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయన్నారు. సిజేరియన్, ఆర్థోపెడిక్, గుండె సంబంధిత ఆపరేషన్ల విషయంలో ప్రభుత్వం నుంచి తక్కువ క్లెయిమ్ వస్తుందని చెప్పి అదనంగా డబ్బులు ఇస్తే మంచి వైద్యం అందిస్తామని వసూలు చేస్తున్నారన్నారు. ఇలాంటి ఆసుపత్రులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రమిచ్చిన వారిలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, జిల్లా సహాయ కార్యదర్శి హుసేన్ బాషా, అబ్దుల్లా, వీరేష్ ఉన్నారు.

## డ్రైనేజీలపై నిర్మాణాలు తొలగించండి



ఆనంద్ థియేటర్ వద్ద మురుగును పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్) : మురుగు కాల్వలపై నిర్మాణాలను తొలగించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. మంగళవారం నగరంలోని వివిధ కాలనీల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ తనిఖీ చేశారు. ఆర్‌ఎస్ రోడ్డు, బంగారు పేట, మౌర్య ఇన్ కూడలి, రివర్వ్యూ కాలనీ, ఆనంద్ థియేటర్, హంద్రీనది పై వంతెన, పాత డంపింగ్ యార్డు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. మురుగు కాల్వలను శుభ్రం చేసేందుకు వీలు లేకుండా నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే సామర్థ్యానికి మించి మురుగు నీరు ప్రవహిస్తున్న కాల్వలను గుర్తించి వాటి స్థానంలో నూతనవి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఏసీపీ రంగస్వామి, డీఈ క్రిష్ణలత, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వలీ పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : జిల్లా జట్టుకు ఎంపికయిన క్రీడాకారులు వచ్చే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి పరమేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్ -19 విభాగంలో బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. డీవీఈవో మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఎస్‌జీఎఫ్ పోటీలను అవకాశంగా మలచుకొని రాణించాలన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి సి. హర్షవర్ధన్ మాట్లాడుతూ బుధవారం ఖో-ఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.




రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన బాస్కెట్‌బాల్ బాలుర జట్టు

#### రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు (రూరల్) : కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వి ద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాట్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి పీటర్, అండర్-17 విభాగంలో 10వ తరగతి విద్యార్థి జాషువా ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ నాయకంటి గిడ్డయ్య తెలిపారు. బుధవా రం పాఠశాల ఆవరణలో సభలో విద్యార్థులను హెచ్‌ఎం ఎస్ కృష్ణతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 28, 29, 30వ తేదీలలో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే పోటీల్లో విజ యం సాధించాలని విద్యార్థులకు సూచించారు.

## ప్రభుత్వ మద్యం దుకాణ ఉద్యోగుల నిరసన ర్యాలీ



ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ ఎస్‌పీసీఎల్ సూపర్‌వైజర్స్ అండ్ సేల్స్ మెన్స్ యూనియన్ నాయకులు

కర్నూలు : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ ×ఛలో ఐఎంఎల్ డిపో॰ పేరుతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బీవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం స్థానిక చెన్నమ్మ సర్కిల్ నుంచి కల్లూరు శివారు హంద్రీ నది ఒడ్డున ఉన్న ఐఎంఎల్ డిపో వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. జిల్లాలో 178 మద్యం దుకాణాలు ఉండగా ఒక్కొక్క దుకాణంలో ముగ్గురు సూపర్‌వైజర్లు, ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్ పనిచేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలు అప్పగిస్తే అందులో తమకు ఉపాధి కల్పించాలని వారు ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జతిన్ చంద్రారెడ్డి, అడ్వైజర్ నాగచంద్రుడు, శివ, సురేంద్ర తదితరులతో కూడిన ప్రతినిధి బృందం డిపో మేనేజర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబుకు వినతి పత్రం సమర్పించారు.